ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
శనివారం 20 ఏప్రిల్ 2024



నిప్పులకొలిమి
• వెల్గటూర్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు 8లో..

ధాన్యం కొనుగోళ్లలో ఆటంకాలు లేకుండా చూడాలి 8లో..

ఉద్యోగులపై ఈసీ నజర్



● నియమావళి ఉల్లంఘిస్తే కొలువుకు ఉద్వాసనే.. ● సోషల్ మీడియాలపై సైతం కన్ను

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కమిషన్ ఉద్యోగులపై కట్టుదిట్టమైన నిఘాను ఏర్పాటు చేసింది. నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో ప్రస్తుతం ఎన్నికల సీజన్ జోరందుకుంది. నేతలు ప్రచారంలో హోరెత్తిస్తుంటే... ఎన్నికల సంఘం తమ విధుల్లో బిజీగా ఉంది. ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్న ఈసీ...ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులపై సైతం ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

ఎన్నికల్లో ఉద్యోగులది కీలక పాత్ర...

ఎన్నికల్లో ఉద్యోగులది కీలక పాత్ర ఉంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వ్యక్తిగత సోషల్ మీడియా అకౌంట్స్‌పై ఎన్నికల కమిషన్ నిఘా పెట్టింది. వారు ఉపయోగించే వాట్సప్ గ్రూపులు, ఫేస్ బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ఖాతాలను ప్రత్యేక బృందాలతో పరిశీలిస్తోంది. గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఆరోపణలు ఉన్న వారిపై అనుమానిత ఉద్యోగులపై మరింత ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఓ నేతకు గానీ, ఓ పార్టీకి గానీ అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా...వాటిని ఫార్వర్డ్ చేసినా ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లుగానే పరిగణిస్తున్నారు. ఆరోపణలు వచ్చిన ఉద్యోగి ఫోన్ కాల్‌డేటాను కూడా పరిశీలించే అవకాశం సైతం లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆధారాలతో ఫిర్యాదు వస్తే చర్యలు...

జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులున్నారు. వీళ్లలో దాదాపు 90 శాతం ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. ఉద్యోగుల్లో నాల్గవ శ్రేణి తప్ప అందరికీ ఎన్నికల విధులు తప్పనిసరిగా ఉంటుంటాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో వాళ్లంతా పనిచేస్తుంటారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల క్రమంలో వీరికి ప్రత్యేక నియమావళిని ఎన్నికల కమిషనర్ జారీ చేసింది. రాజకీయ నేతలతో ఎలాంటి సంబంధాలు ఉండ కూడదని అందులో స్పష్టం చేసింది. ప్రతి రాజకీయ నేత సమావేశం వీడియో చిత్రీకరణ ఉంటుందని...ఇందులో ఉద్యోగులు ఉన్నట్లు తెలిసినా.. నేతలతో సంబంధాలు ఉన్నట్లు ఆధారాలతో ఫిర్యాదు వచ్చినా తక్షణమే సస్పెన్షన్ తప్పదని స్పష్టం చేసింది.

హద్దు మీరితే అంతే సంగతులు...

ఎన్నికల కోడ్‌లో ఉద్యోగులకు ప్రత్యేక నిబంధన ఉన్నప్పటికీ కొందరు వాటిని పట్టించుకోవడం లేదు. జగిత్యాల జిల్లాలో ఇటీవల పలువురు ఉద్యోగులను అధికారులు సస్పెన్షన్ చేయడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదనే నిబంధనలు 1949 సెప్టెంబరు 17వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే అన్ని స్థాయిలు, కేటగిరీల ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లో పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి అధికారి, ఉద్యోగి తన వంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాల్సి ఉంటుంది. హద్దు మీరితే సదరు ఉద్యోగికి ఉద్వాసన తప్పని పరిస్థితి ఉంటుందని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

తప్పించుకోలేకుండా నిఘా..

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి వీడియో సర్వే లైన్స్, స్టాటిస్టికల్ సర్వే లైన్స్ బందాల నియామక ప్రక్రియ పూర్తవగా సభ్యులు ఇప్పటికే నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన సభలు, సమావేశాలను అధికారులు చిత్రీకరిస్తున్నారు. వీటిని ప్రత్యేక బృందం వీక్షిస్తోంది. ఉద్యోగులు పాల్గొన్నట్లు దృష్టికి వచ్చినా, ఎవరి నుంచైనా ఫిర్యాదు వచ్చినా సంజాయిషీ నోటీసు జారీ చేస్తారు. ఉల్లంఘించినట్లు తేలితే సస్పెన్షన్ వేటు వేస్తారు.

సామాజిక మాధ్యమాలపై...

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, మీడియాలో వచ్చే వార్తలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా మీడియా మానిటరింగ్ బృందాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఉద్యోగులు వాట్సప్ గ్రూపులు, ఫేస్ బుక్, ఎక్స్ ఖాతాల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా, వ్యతిరేకంగా పోస్టులు పెడితే మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. సామాజిక మాధ్యమాల ఖాతాలపై ఈసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది.

ఇవీ తప్పే...

ఉద్యోగులు ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఒక అభ్యర్థికి సహకరిస్తున్నారనే చిన్నపాటి ఆధారాలు దొరికినా వేటు పడుతుంది. తన కింది స్థాయి సిబ్బందిని పై అధికారి అధికార దర్పంతో ఒక పార్టీకి సహకరించాలని, ఫలానా పార్టీకి ఓటేయాలని చెబితే ఈసీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రచార సభల్లో పాల్గొనడం, తమ కులం నేతలని ప్రచారం చేయడాన్ని కూడా తీవ్రంగానే పరిగణిస్తారు. ఉద్యోగులు తమ సొంత ఊళ్లలోనూ కండువా వేసుకొని ప్రచారం చేయడం, రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం చేసినా వేటు వేసే అవకాశాలున్నాయి. ఈ తరుణంలో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని, నిర‌క్ష్యంగా వ్యవహరిస్తే కొలువులకు ఎసరు వస్తుందని గుర్తుంచుకోవాలని పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు సూచిస్తున్నారు.

ఇటీవల వివాదాస్పద సంఘటనలు కొన్ని..

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఉద్యోగులు వ్యవహరించిన వివాదాస్పద సంఘటనలు చర్చకు వస్తున్నాయి. మల్యాల మండలంలో పనిచేస్తున్న జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం సారంగపూర్ మండలం రేచపల్లి మ్యాడారం తండాకు చెందిన ఓ ఫాక్స్ ఉద్యోగి అధికార కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడంతో ఓ ప్రజాప్రతినిధి చేసిన ఫిర్యాదు మేరకు ఎన్నికల సంఘం అధికారులు విచారణ జరిపి సస్పెన్షన్ వేటు వేశారు. అదేవిధంగా సారంగపూర్ మండలం రంగపేట కు చెందిన ఓ ఐకేపీ ఉద్యోగి సైతం అధికార కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడం వివాదాస్పదమైంది. ఈ సంఘటనపై సైతం అధికారులు నోటీసులు జారీ చేసి విచారణ అనంతరం సస్పెన్షన్ చేసినట్లు ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. అదేవిధంగా జగిత్యాల మున్సిపల్‌కు చెందిన ఓ కాంట్రాక్టు ఉద్యోగి నిజామాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థితో ఓ సందర్భంగా కలిసిన ఫొటోలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతోంది. ఉద్యోగుల వివాదాస్పద అంశాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. విచారణలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే అవసరమైన చర్యలు తీసుకోనున్నారు.

బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ తరపున నామినేషన్ దాఖలు



కరీంనగర్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి బండి సంజయ్ నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

కరీంనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి శుక్రవారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. బండి సంజయ్ తరపున బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి బీజేపీ నాయకులు అందజేశారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తరపున పార్టీ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. ఈకార్యక్రమంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల బీజేపీ పార్టీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్ కార్పొరేషన్ మాజీ మేయర్ డి.శంకర్, బీజేపీ నాయకుడు బండ రమణారెడ్డి పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీ పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని డీఈవో జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, స్లోగన్ రైటింగ్, డిజిటల్ డ్రాయింగ్ పోటీలలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వ్యాసరచన పోటీలో సురేంద్ర, స్లోగన్ పోటీలో ఆంజనేయులు, డ్రాయింగ్ పోటీలో వర్షిణిలు ప్రతిభ కనబరచగా బహుమతులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీవో సంపత్ రావు, సెక్టోరల్ అధికారి కొక్కుల రాజేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు హరి కిషన్ పాల్గొన్నారు.

అంజన్న దీక్షాపరులకు ముస్లింల భిక్ష



ముస్లిం సోదరులతో అంజన్న స్వాములు

జగిత్యాల టౌన్, మార్చి 19: జిల్లా కేంద్రానికి చెందిన ముస్లిం సోదరులు నదీమ్, హఫీజ్ శుక్రవారం అంజన్న దీక్షాపరులకు బోజనం(బిక్ష)అందజేసి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనంగా హనుమాన్ దీక్షా పరులకు బిక్ష ఏర్పాటు చేశామన్నారు. ప్రజలంతా కుల, మతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని కోరారు. అంతకు ముందు స్వాములు భజన సంకీర్తనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజన్న భక్తులు ఉన్నారు.

స్కూల్ బస్సులకు ఇన్సూరెన్స్ బాధ్యత యాజమాన్యాలదే



పాఠశాల వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 19 : పాఠశాల వాహనాల కు ప్రతి ఏటా ఇన్సూరెన్స్ చేయాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని జిల్లా రవాణాశాఖ అధికారి వంశీధర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల మండలంలోని మోతె, పెరకపల్లిలో రాజీవ్‌బైపాస్ కూడలితో పాటు పలు ప్రాంతాల్లో డీటీవో ఆదేశాల మేరకు రవాణాశాఖ అధికారులు పాఠశాల వ్యాన్‌లను తనిఖీ చేసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీటీవో మాట్లాడుతూ ప్రతి రోజు విధిగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి వాహన యజమాని ఇన్సూరెన్స్ పత్రాలను విధిగా కలిగి ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం వహించి ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో డీటీవో వంశీధర్, ఎంవీఐలు వెంకన్న, రామారావు, ఏఎంవీఐ ప్రమీల, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనానికి 47 చలాన్లు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 19 : జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం టౌన్ ఎస్సై మన్మధరావు ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీసుల వాహనాల తనిఖీలో ఒక ద్విచక్ర వాహనానికి 47 చలాన్లు ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనదారుడితో 47 చలాన్లకు సంబంధించి రూ. 12,805 వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టారు. అనంతరం ఎస్సై సంబంధిత వాహన యజమానికి రసీదు అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వాహన దారులు తక్షణమే తమ పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని కోరారు. తనిఖీల్లో పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ షేక్‌యాస్మిన్ బాషా

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):అర్హత గల ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో స్వీప్ కార్యక్రమాల నిర్వహనపై సమీక్ష సమావే శాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడారు. ఓటింగ్ శాతం ఎక్కడయితే తక్కువ ఉంటుందో ఆయా ప్రాంతాలలో స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, ఆర్డీవో మధుసుదన్, స్వీప్ నోడల్ అధికారి మదన్ మోహన్, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ



మెట్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి, ఏప్రిల్, 19 : అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు పాటిస్తే నివారించడం చాలా సులభమని, ప్రమాదాలను అరికట్టి జాతి సంపదను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మెట్‌పల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి మల్లికార్జున్‌యాదవ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల భాగంగా శుక్రవారం పట్టణంలోని ట్రెండ్స్ షాపింగ్ మాల్, లక్ష్మి టాకీస్‌తో పాటు పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అనంతరం కరపత్రాలు, వాలు పోస్టర్లను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండ వేడిమి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఆందోళన చెందకుండా మంటలు ఆర్పేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాలను అరికట్టడానికి తీసుకునే సూచనలు సలహాలను షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్‌ల నిర్వాహకులు, ప్రజలకు విన్యాసాలతో సిబ్బంది అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది హైదూల్లాఖాన్, అంజనేయులు, అమర్‌సింగ్, సంతోష్ కుమార్, భాస్కర్, సంతోష్, మహర్షి, ప్రజలు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో నగదు పట్టివేత

ధర్మపురి, ఏప్రిల్ 19: మండలంలోని రాయపట్నం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా పోలీస్ చెక్ పోస్టు వద్ద పోలీసులు రూ. 2లక్షల నగదును శుక్రవారం పట్టుకున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, సిబ్బందితో కలిసి చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి సరైన ధృవపత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 2లక్షలు నగదు సీజ్ చేసి అధికారులకు అప్పజెప్పారు.

మూడు రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత

జగిత్యాల టౌన్, మార్చి 19: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ లీకేజీ పనుల మరమ్మతుల దృష్ట్యా శనివారం నుంచి సోమవారం వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనీల్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరవింద్ నగర్, పురాణీ పేట, మోతె మాలవాడ, శ్రీరాంనగర్, వాణి నగర్, బీట్ బజార్, భాగ్యనగర్, గోవిందుపల్లి తదితర ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.

కాబట్టి ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

రెండవ రోజు ఏడు నామినేషన్లు





నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి ఇస్తున్న ధర్మపురి అర్వింద్, బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి రెండవ రోజు శుక్రవారం ఆరుగురు అభ్యర్థులు మొత్తం ఏడు నామినేషన్లను దాఖలు చేశారు. లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ తరఫున అర్వింద్ ధర్మపురి నామినేషన్ వేశారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా రాపెల్లి శ్రీనివాస్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా రాగి అనిల్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి రోజు రెండు నా మినేషన్‌లు దాఖలు కాగా, రెండవ రోజు ఆరుగురు మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు ఇప్పటి వరకు నామినేషన్లు దాఖలు చేశారు.

● పసుపు రైతులతో కలిసి అర్వింద్ నామినేషన్

నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్ పసుపు రైతులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం పార్లమెంట్ పరిధిలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, జగిత్యాల, కొరుట్ల నియోజకవర్గాలకు చెందిన పసుపు రైతులతో కలిసి అయన తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతుకు అందజేశారు. ఎంపీ అర్వింద్ నామినేషన్ రుసుము రూ.25వేలను పసుపు రైతులు చెందాలు వేసుకొని సమకూర్చారు. బాల్కొండకు చెందిన రైతులు వెల్మ రమేష్ తన ఇంటివద్దే సుమారు 40 క్వింటాళ్ల పసుపును క్వింటాలుకు రూ.19,500ల చొప్పున అమ్ముకోగా ఆయన అర్వింద్‌కు నామినేషన్‌ను ప్రపోజ్ చేశారు. నామినేషన్ అనంతరం అర్వింద్ మాట్లాడుతూ.. గడిచిన ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ రైతులు తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగిందన్నారు. పసుపు రైతుల సమక్షంలో వారి ఆశీర్వాదంతో ఈ ఎన్నికల్లో గెలుస్తానని నమ్మకం తనకు ఉందన్నారు.

నిజామాబాద్ తరలిన బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల టౌన్ : బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం నామినేషన్ దాఖలు పక్రియకు జగిత్యాల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లి గోవర్ధన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఉన్నారు.

26 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్ పరీక్షలు

గణేష్‌నగర్, ఏప్రిల్ 19: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హోటల్ మేనేజ్‌మెంట్ 2,6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26 నుంచి మే3 వరకు జరుగుతాయని పరీక్షలు నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

'ఉపాధి' కూలీలపై బండరాయి పడి ముగ్గురికి గాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: మండలంలోని సుద్దాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. మట్టి తవ్వుతుండగా పైనుంచి పెద్ద బండరాయి పడడంతో ముగ్గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. మరి కొందరు తృటిలో ప్రాణాలు కాపాడుకున్నారు. సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సుద్దాలలోని పెద్దమ్మ కుంట వద్ద 160 మంది కూలీలు కొన్ని రోజులుగా పూడిక తీత పనులు చేస్తున్నారు. శుక్రవారం కూడా వారు పని చేస్తుండగా పై నుంచి పెద్ద బండరాయి కూలీలపై పడింది. బుర్ర స్వరూప, కలువల లింగమ్మ, తార అనే ముగ్గురు మహిళలు గాయపడ్డారు. వెంటనే వీరిని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సుల్తానాబాద్ అస్పత్రికి తరలించారు. అనంతరం ముగ్గురిని ఎంపీడీవో కరీంనగర్ అస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. వీరిలో తార, లింగమ్మ లకు మామూలు గాయాలు కాగా బుర్ర స్వరూపకు నడుముకు గాయం కావడంతో అమెకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పారని తెలిపారు. సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అన్నారు. అస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కాంగ్రెస్ నాయకుడు మినుపాల ప్రకాష్‌రావు పరామర్శించారు.



అస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

పిడుగు పడి రైతు కూలీకి తీవ్రగాయాలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 19: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెంది న కోరుట్ల రమేష్ అను రైతు కూలీ శుక్రవారం సాయంత్రం పడ్డ పిడుగు పాటుకు తీవ్రగాయాలపాలయ్యాడు. గ్రామంలోని కోరుట్ల రమేష్ వ్యవసాయ కూలీ పనులను చేసుకంటూ జీవనం కోనసాగిస్తున్నాడు. శుక్రవారం సాయం త్రం కూలీ పనులు ముగించుకోని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఈదురు గాలులు, ఉరుములతో కూడి చినుకులు కురిసింది. చినుకులు పడుతుందని రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడింది. చెట్టు పక్క కాడం ఊడిపోవడంతో రమేష్ కాలు, చెయికి తీవ్రగాయల పాలవడంతో పాటు పిడుగు పాటుకు ఆయన ఒంటి బలమైన గాయాలు తలిగినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు చికిత్స కోసం మెట్‌ప ల్లి అనుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్న అతనికి తీవ్రగాయల పాలైనం దుకు ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామానికి చెం దిన పారిపెల్లి రాజిరెడ్డికి చెందిన ఆవు పిడుగుపాటుతో మృతిచెందింది. రాజు తన పాడి ఆవును శుక్రవారం వ్యవసాయ బావివద్ద కట్టివేసి రాగా సాయం త్రం పడిన పడిగుపాటుతో మృతిచెందింది. దీనితో తనకు రూ 80వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రాజిరెడ్డి విల పిస్తు కోరాడు.

విద్యుదాఘాతంతో గేదె..

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని సర్పరాజుపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన కొక్కు గణేష్ తన గెదలను మోపడానికి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేతంకు వెల్లినట్లు తెలిపారు. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్ పార్మర్ వద్ద మోస్తుండంగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినుట్ల గ్రామస్థులు తెలిపారు. కాగా యజమాని గణేష్ సుమార్ రూ. 50000 వరకు నష్టం వాటిలినట్లు బాదితుడు తెలిపాడు. బాదితుడిని ప్రభుత్వ పరంగా అదుకోవాలని గ్రామస్థులు కొరుతున్నారు.

పాముకాటుకు ఎద్దు..

రామగిరి, ఏప్రిల్ 19: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన మాటేటి పర్వతాలు అనే రైతుకు చెందిన ఎద్దు శుక్రవారం పాటుకాటుకు గురై మృతి చెందింది. పొలం వద్ద గడ్డి మేస్తున్న తరుణంలో పాటుకాటుకు గురైంది. పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌కు సమాచారం అందించగా స్పందించి వైద్యం చేసినా అప్పటికే మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు 60 వెల వరకు ఉంటుంది.

ఆలయంలో చొరబడి ఫొటోలు, తులసి గద్దె విసిరివేత

- అన్యమతస్థుల పనేనని అనుమానం
- హనుమాన్ మాలధారుల ఆందోళన
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- విచారణ చేపట్టిన పోలీసులు



పొలంలో పడవేసిన వేంకటేశ్వర స్వామి చిత్రపటం, విచారణ జరుపుతున్న ఎస్సై ఉమా సాగర్

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని జగదేవ్‌పేట నగారా వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆకతాయిలు ఆగడం సృష్టించారు. ఆలయంలో ఉన్న వేంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి చిత్రపటాలను, తులసి గద్దెను సమీపంలోని పొలంలో విసిరివేయడం కలకలం సృష్టించింది. వివరాలలోకి వెళ్లితే... జగదేవ్‌పేటలోని నగారా వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యం హనుమాన్ మాలధారులు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని పెట్టుకొని పూజలు నిర్వహిస్తూ రాత్రి అక్కడే బస చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం లక్ష్మీపూర్ ఆలయానికి దర్శనార్థం వెళ్లారు. అదను చూసుకున్న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి ఆలయంలోని వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ చిత్రపటాలతో పాటు ఆలయం ముందు ఉన్న తులసి గద్దెను సమీపంలోని పొలంలో విసిరివేశారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన హనుమాన్ మాలధారులు దేవుళ్ల చిత్రపటాలు పొలంలో పారవేయడం చూసి ఆందోళన చెందారు. ఆలయ చైర్మన్ కొర్రి గంగయ్యకు, మాజీ సర్పంచ్ లింగమ్మ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డిలకు సమాచారం ఇచ్చారు. మాలధారులు, మరికొందరు కలిసి వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉమాసాగర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలి ముద్రలు సేకరించారు. కాగా ఈ పని చేసింది అన్యమతస్తులేనని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆలయ చైర్మన్ కొర్రి గంగయ్య, మాజీ సర్పంచ్ లింగమ్మ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి హనుమాన్ దీక్ష పరులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో హిందూ దేవాలయాలు, హనుమాన్ దీక్ష పరులను అవమానించడం ఎక్కువగా జరుగుతోందని బీజేపీ నాయకుడు కొమ్ము రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు.

స్కూల్ ఆటో బోల్తా

రామగిరి, ఏప్రిల్ 19: మండలంలోని రత్నాపూర్ గ్రామసమీపంలో కారు ఢీకొట్టిన ప్రమాదంలో స్కూల్ ఆటో బోల్తాపడింది. సెంటినరీకాలనీ నుంచి నాగే పల్లి వైపు టిఎస్22 టిఏ 2087 నంబరు గల ఆటోలో ప్రైవేట్ స్కూల్ విద్యా ర్థులను తరలిస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో విద్యార్థులతో ఉన్న ఆటో పల్టీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ నరివెద్ది సంపత్‌కు ఎడమ కాలు ఫ్రాక్చర్ కాగా, విద్యార్థులకు గాయాలు కాలేదు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 19: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆరో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.వి.శ్రీరంగప్రసాద్ తెలిపారు. మొత్తం 16,557 మంది విద్యార్థులకు గాను 16,003 మంది విద్యార్థులు హాజరు కాగా 554మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులు ఏమీ నమోదు కాలేదని ఆయన తెలిపారు.

పాలీసెట్ దరఖాస్తుకు 22 వరకు గడువు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలీసెట్-24) రాసేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ఆవాస మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు కరీంనగర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ ఆదర్శ మహిళా రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో
ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరిం చారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఎనిమిది మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా అందులో ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మిగతా ఐదుగురు వ్యక్తులకు 10 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

కరీంనగర్‌లో రూ.15.81లక్షల నగదు సీజ్



కరీంనగర్‌లో సీజ్ చేసిన నగదును చూపిస్తున్న సీఐ సరిలాల్, వేములవాడలో నగదు స్వాధీనం చేసుకున్నట్టు పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం కరీంనగర్‌లోని పలుచోట్ల శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని 15 లక్షల 81 వేల 900 రూపాయల నగదును పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని రాజీవ్ చౌక్ వద్ద కరీంనగర్ దుర్గమ్మగడ్డకు చెందిన జలగం సుమన్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న ఏడు లక్షల నగదును సీజ్ చేశారు. కరీంనగర్ రెండో ఠాణా పరిధిలోని ఇందిరా చౌక్ వద్ద మానకొండూర్‌కు చెందిన నెల్లి భాస్కర్(కపిల్ చిట్‌ఫండ్స్) వద్ద 1,11,900 రూపాయలు, ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన కొల ప్రదీప్ కుమార్ వద్ద 5,70,000 రూపాయలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ మూడో ఠాణా పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో కట్టారాంపూర్‌కు చెందిన గాండ్ల సురేష్‌వద్ద 2 లక్షల రూపాయలను స్వాధీన పరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన మొత్తం నగదును తదుపరి సీజర్ కమిటీకి స్వాధీనం చేశామని సీఐలు సరిలాల్, విజయ్ కుమార్, జాన్‌రెడ్డిలు తెలిపారు.

● వేములవాడలో 5.67 లక్షలు పట్టివేత..

వేములవాడ: వేములవాడ పట్టణంలో తగిన పత్రాలు లేకుండా తీసుకువెళుతున్న ఐదు లక్షల 67 వేల రూపాయల నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తనిఖీల సందర్భంగా నంద్యాడపు నర్సయ్య అనే వ్యక్తి వద్ద ఐదు లక్షల 67 వేల రూపాయలు పట్టుబడ్డాయని తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు తెలిపారు.

అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం


చిన్నమల్లయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఓ వైపు అప్పులు చేసి పంట సాగు చేస్తే తెగుళ్ల సోకి దిగుబడి రాదనే ఆందోళన.. మరో వైపు ఇంటి భవన నిర్మాణానికి తెచ్చిన బాకీలు తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపం చెందిన అన్నదాత నెత్తెట్ల చిన్నమల్లయ్య(48) ఉరి వేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామంలో శుక్రవారం విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని రైతు చిన్నమల్లయ్య తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిని యేడాది కిందట మూడు లక్షల రూపాయలు అప్పులు చేసి చదును చేశాడు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో మరో రూ.1.50 లక్షలు అప్పు తీసుకువచ్చి వరి పంట వేశాడు. పంటకు తెగుళ్ల సోకి దిగుబడి తగ్గుతోందని ఆందోళన చెందాడు. ఇటీవల రూ. 10.50 లక్షలు అప్పులు చేసి ఇంటి భవన నిర్మాణాన్ని చేపట్టాడు. బాకీలు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన చిన్నమల్లయ్య ఈ నెల 18న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో గొర్రెల కాపారులకు వ్యవసాయ పొలం సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడ చేరుకుని చిన్నమల్లయ్యదీగా గుర్తించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా రోదించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కొడుకు అజయ్, కూతురు అమూల్య ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

స్కూల్ యూనిఫాంల తయారీలో నాణ్యత పాటించాలి

- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు


సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో క్లాత్ తయారీని పరిశీలిస్తున్న మల్లయ్యభట్టు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫాంల వస్త్రాలను నాణ్యతప్రమాణాలతో తయారు చేసి అందించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మలయ్యభట్టు అధికారులకు సూచించారు. సిరిసిల్ల పట్టణంతో పాటు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో తయారవుతున్న ఆర్వీఎం వస్త్రాలతో పాటు చంద్రంపేటలోని గౌడ సైజింగ్‌లను శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి మల్లయ్యభట్టు సందర్శించి తయారుచేసిన వస్త్రాలతో పాటు తయారీ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్ పార్కులో తయారు చేస్తున్న స్కూల్ యూనిఫాం వస్త్రాల తయారీతో పాటు వాటిలో ఉండే నాణ్యతలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర సీఎంవో జోసెఫ్, టెస్కో జనరల్ మేనేజర్ ఎల్ వెంకటేశ్వర్‌రావు, చేనేత జౌళిశాఖ ఆర్‌డీడీ అశోక్‌రావు, ఏడీ సాగర్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, జెండర్, ఈక్విటీ కోఆర్డినేటర్ పద్మజ, ఈఈ అనిత తదితరులు పాల్గొన్నారు.


కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మలయ్యభట్టు

● కస్తూర్బాగాంధీ పాఠశాలల తనిఖీ..

సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూర్‌లో ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలతో పాటు తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలను శుక్రవారం సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు ఆకస్మికంగా సందర్శించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనాలను పరిశీలించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు వసతులను కల్పించి చూసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనాలతో పాటు వసతులను అందిస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల పాఠశాలకు మంజూరైన అదనపు అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర సీఎంవో జోసెఫ్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, పద్మజ, పాఠశాల ప్రత్యేక అధికారి పావనిలు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 19: వేములవాడ మండలం అనుపురం ముంపు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పరును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు రూరల్ తహసీల్దార్ సుజాత శుక్రవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ముంపు గ్రామాల పరిధిలోని గ్రామాల భూముల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో ఒక్క టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని
మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: మండలంలోని నలుగురు వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కరునాథం శివకృష్ణను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బొల్లం రాజు, తిప్పరవేణి చంద్రశేఖర్, ధర్మ శ్రీనివాస్‌కు పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో ఉద్యోగాలు ఇప్పిస్తానని సిరిసిల్ల పట్టణానికి చెందిన శివకృష్ణ 2018లో రూ 6.50లక్షలు తీసుకున్నాడు. శివకృష్ణ వ్యవసాయశాఖలో అటెండర్‌గా పనిచేస్తుండటంతో నమ్మి డబ్బులు ఇచ్చామని 2013లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లో ఉంటున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిరుద్యోగులు ఎవరు ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మి మోసపోవద్దని ఎస్సై సూచించారు.

సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అస్వస్థత

- వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి
- 25 మందికి ఆస్పత్రిలో చికిత్స


చికిత్స పొందుతున్న విద్యార్థులు


హాస్టల్‌లోని సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: సుల్తానాబాద్ పట్టణ శివారులో ఉన్న సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల వసతి గృహంలో 25 మంది విద్యార్థులకు అస్వస్థకు గురయ్యారు. హాస్టల్‌లో మొత్తం విద్యార్థుల సంఖ్య 480 మంది కాగా, గురువారం 372 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 20 మందికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి మొదలైంది. హాస్టల్‌లో సిబ్బంది వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. శుక్రవారం మరో ఐదు మంది విద్యార్థులకు కూడా ఇదే విధంగా వాంతులు, విరేచనాలు కావడంతో వారిని కూడా ఆస్పత్రికిలో చేర్చారు. పరీక్షలు ఉండడంతో కొంతవరకు కొలుకున్న వారిని శుక్రవారం ఉదయం హాస్టల్‌కు తరలించారు. పరీక్షల తర్వాత వారిని హాస్టల్‌లోని ఒక ప్రత్యేక గదిలో ఉంచి శుక్రవారం రాత్రి డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరగన్నం మాత్రమే అందించారు. గురువారం సాయంత్రం బొండాలు పెట్టారని, అవి తినలేని పరిస్థితిలో ఉన్నాయని, ఈ విషయం హాస్టల్ ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, కొందరు వాటిని పడవేశారని, తిన్న తమకు వాంతులు, విరోచనాలు, విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

● రీజనల్ డైరెక్టర్ పరిశీలన...

హాస్టల్‌లో ఆహారం పడక కొంత మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న సోషల్ వేల్ఫేర్ శాఖ రీజనల్ డైరెక్టర్ మేరీ ఏసుపాదం శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని, హాస్టల్‌లో ఉన్న వారిని పరామర్శించారు. ఇలా ఎందుకు జరిగిందని ఆరా తీశారు.

● మెనూ ప్రకారం పెడుతున్నాం..

- సత్యప్రసాద్, ప్రిన్సిపాల్

మెనూ ప్రకారమే హాస్టల్‌లో భోజనం, టిఫిన్‌లు పెడుతున్నాం. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం కూడా బోండాలు పెట్టాం. బోండా పిండి కొంచెం పలుచగా రావడం వల్లన నూనె ఎక్కువ పీల్చుకోవడంతో అవి కొందరికి పడకపోయి ఉండవచ్చు. నాకు సమాచారం రాగానే హైదరాబాద్ నుంచి తెల్లవారుజామున సుల్తానాబాద్ వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించాను. వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నాం. డిశ్చార్జ్ అయి వచ్చిన విద్యార్థులకు డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరుగు అన్నం అందిస్తున్నాం.

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి

మేడిపల్లి, ఏప్రిల్ 19: మేడిపల్లి మండల కేంద్రంలో నీటి తొట్టిలో పడి బాలుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఒరిస్సాకు చెందిన బైగని సాబర్ అనే మహిళ తన ఇద్దరు పిల్లలను తీసుకొని నాలుగు నెలల క్రితం స్థానికంగా ఉన్న ఇటుక బట్టిలో పనిలో చేరింది. గురువారం సాయంత్రం పిల్లలతో కలిసి పరమేష్(7) నీటి సంపు వద్ద స్నానానివెళ్లి ప్రమాదవశాత్తు తొట్టిలో పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బయటకు తీసి జగిత్యాల అసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రెండేళ్ల క్రితమే మృతి చెందాడు. మృతుడి తల్లి బైగని సాబర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ ఇలియాజ్ అహ్మద్ తెలిపారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని వంతెనపై శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి మండలంలోని పదిర గ్రామానికి చెందిన వ్యక్తి రెక్కల బుచ్చిరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పదిరలోని వ్యక్తి బుచ్చిరెడ్డి తన ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, ఏప్రిల్ 19: మండల కేంద్రానికి చెందిన చింతం లక్ష్మి(74) అనే వృద్ధురాలు శుక్రవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగిన నయం కాకపోవడంతో మానసిక వేదనకు గురవుతోంది. మళ్లీ డాక్టర్ల చుట్టూ తిరగలేక, బ్రతుకు మీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్19: కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్ వద్ద కరీంనగర్-వేములవాడ రోడ్డుపై శుక్రవారం ఉదయం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో శాంతినగర్‌కు చెందిన యువకుడు ఠాక్ విశాల్(19) దుర్మరణం చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాల్ తన బైక్‌పై కమాన్‌పూర్‌లోని బంక్‌లో పెట్రోల్ నింపుకుని తిరిగి శాంతినగర్‌కు వస్తున్న సమయంలో కరీంనగర్ నుంచి వేములవాడ వైపు అతివేగంగా బైక్‌పై వెళ్తున్న భూమి రాకేష్ ఢీకొట్టాడు. దీంతో విశాల్‌కు తీవ్రగాయాలు కాగా అతన్ని కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంలో రాకేష్‌కు కూడా గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి కవిత ఫిర్యాదుతో కేసు విచారణ జరపుతున్నామని పోలీసులు తెలిపారు.

హుజూరాబాద్ డిపోలో ఆరుగురిపై బదిలీ వేటు

హుజూరాబాద్, ఏప్రిల్ 19: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో పనిచేసే ఆరుగురి ఉద్యోగులపై శుక్రవారం వేటు పడింది. ఈ మేరకు ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎం సురికొంటి భూపతిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్20వేల రూపాయలు లంచం తీసుకుం టూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విధితమే. దీనికి స్పందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ డిపో కార్యా లయంలో పనిచేసే కొంత మంది సిబ్బంది శ్రీకాంత్‌కు సన్నిహితంగా ఉన్నారని ఆర్టీసీ విజిలెన్స్ ఎంక్వైరీ అధికా రులు ఇచ్చిన నివేదిక మేరకు ఆరుగురిని కరీంనగర్ ఆర్ ఎం కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీ అయిన వారి లో రాజమణి (డ్యూటీ చాటింగ్), వెంకటయ్య (బుకింగ్ క్లర్క్), సురేందర్ (సూపరింటెండెంట్), జాఫర్ (మెకానిక్ ఎల్వో), రవీందర్ (డ్రైవర్), శంకరపట్నం బస్టాండ్‌లో పనిచేసే స్వామిలను బదిలీ చేశారు. ఇదే డిపోలో మరో ఇద్దరిపై కూడా బదిలీ వేటు పడనున్నట్లు తెలిసింది.

తాటి చెట్లు దగ్ధం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19: తంగళ్లపల్లి మండలం తాడూరు శివారులో అగ్ని ప్రమాదంలో తాటి చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో గీతకార్మికులు సుమారు 500 తాటి చెట్లను పది సంవత్సరాలుగా సంరక్షిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రమాద వశాత్తు నిప్పు అంటుకొని మంటలు చెలరేగడంతో సుమారు 300 తాటి చెట్లు దగ్ధం అయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలాన్ని గౌడ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగంగౌడ్ పరిశీలించి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కాగా దగ్ధం అయిన చెట్లను కాంగ్రెస్ నాయకుడు పుర్మాణి లింగారెడ్డి, మీరాల శ్రీనివాస్‌యాదవ్ పరిశీలించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న నిందితుడి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట వద్ద ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని పరీద్‌పేటకు చెందిన కోల రవిగౌడ్ (46)ను శుక్రవారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇతను సిరిసిల్ల పట్టణంలోని సినారె గ్రంథాలయం, దామిని బార్ ఎదుట పార్క్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను చోరీచేసి ఒక వాహనాన్ని చెట్ల పొదల్లో దాచిపెట్టి మరో వాహనంపై తిరుగుతండగా పట్టుకున్నామని తెలిపారు. చోరీ చేసిన రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని దొంగను కోర్టులో హాజరుపరచామని ఆయన తెలిపారు.


ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని కిషన్‌రావుపేటలో శుక్రవారం డీఎస్పీ రఘుచందర్ ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. కిషన్‌రావుపేటకు చెందిన మెరుగు కొమురయ్య అనే వ్యక్తి తనను కులం పేరుతో దూషించాడని అదే గ్రామానికి చెందిన అన్నపూర్ణ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కొమురయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ రఘుచందర్ కిషన్‌రావుపేటలో విచారణ చేపట్టారు. సాక్షులను విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎస్సై ఉమాసాగర్ ఉన్నారు.

కొండగట్టులో
నత్తనడకన చిన్న జయంతి ఏర్పాట్లు


ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణం

మల్యాల, ఏప్రిల్ 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో చిన్న జయంతి ఏర్పాట్లు నెమ్మదిగా జరుగుతున్నాయి. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జయంతి వేడుకలకు గాను ఇప్పటికే దాదాపుగా ఏర్పాట్లు పూర్తి కావాల్సి ఉండగా నత్తనడకన సాగుతున్నాయి. కొండపైన దీక్షపరులు, లడ్డూ ప్రసాదాల కోసం క్యూలైన్‌లు ఏర్పాటు కాగా మిగితా ఏర్పట్లు అంతంత మాత్రమే. విద్యుత్ లైట్స్, మైక్‌ల పనులు కావాల్సి ఉండగా చలివేంద్రాల ఏర్పాటు ఊసేలేదు. భక్తులు నడిచి వచ్చే ఘాట్‌రోడ్డు, మెట్ల మార్గంలో చేపట్టాల్సిన సౌకర్యాలు ప్రారంభించలేదు. జయంతికి సంబందించిన ప్రచార ఫ్లెక్సీలు మాత్రం ఏర్పాటు చేశారు. లక్షలాదిగా తరలివచ్చె దీక్షపరులకు తగిన సౌకర్యాలను త్వరగా పూర్తిచేయాలని ఇటీవల కలెక్టర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా అడిషనల్ కలెక్టర్ నేతృత్వంలో మరోసారి సమపన్వయ సమావేశం నిర్వహించినా ఏర్పాట్లలో వేగం కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సౌకర్యాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతన్నారు.


ఘాట్‌రోడ్డు వెంట లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కాంగ్రెస్ గెలుపునకు నాంది పలకాలి

ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కోరుట్ల, ఏప్రిల్ 19: నిజామాబాదు పార్లమెంట్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఈ నెల 22న నామినేషన్ సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు నాంది పలకాలని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జువ్వాడి భవనం లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింరావు, సీనియర్ నాయ కులు జువ్వాడి కృష్ణారావులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. నిజామాబాదు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గత ఐదేళ్లలో ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజలలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అవాకులు చెవాకులు చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి బారీ మెజార్టీతో గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, అన్వర్, సింగిల్ విండో ఛైర్మెన్ బీం రెడ్డి, నాయకులు కొమిరెడ్డి కరంచంద్, కొంత రాజం, మచ్చ కవిత, సోగ్రబీ, పుప్పాల ప్రభాకర్, ఏలేటి మహిపాల్, దివాకర్, మ్యాక ల నర్సయ్య, రంజిత్, కటుకం చంద్ర శేఖర్, గణేష్, వీరబత్తిని దశరథంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



మాట్లాడుతున్న సీడీపీవో నర్సింగరాణి

కొడిమ్యాల, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే, స్కూల్ డే నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీడీపీవో నర్సింగరాణి మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలకు శారీరక, మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. నైపుణ్యంతో కూడిన సెలబస్‌తో బోధన, క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవడుతాయన్నారు. అంగన్‌వాడీ నుంచి ప్రైమరీ పాఠశాలకు వెళ్లే వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమ, ఏఎన్‌ఎం స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సుజాత, మమత, కవిత, స్వప్న, హసీనా, కాంతమ్మ, లావణ్య అర్చన, ఆశాకార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామం లోని అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్ డే వేడుకలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత మాట్లాడుతూ ప్రీ స్కూల్ ప్రాముఖ్యత, పిల్లల సమ గ్ర వికాసం గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు ప్రగతి పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లలిత, మండల మహిళ సమైక్య అధ్యక్షురాలు వనిత పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారించాలి



రాజారాం తండాలో వీధి బోరును పరిశీలిస్తున్న డీపీవో

కథలాపూర్, ఏప్రిల్ 19 : మండలంలోని రాజారాం తండా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ గ్రామాన్ని సందర్శించారు. మిషన్ భగీరథ ట్యాంక్ నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా నీరు రావడం లేదని గిరిజనులు అధికారుల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. వీధుల్లో ఉన్న బోర్లతో నీరు సరిపోవడం లేదన్నారు. రెండు బోర్లు అద్దెకు తీసుకుని ట్యాంక్‌కు నీరు సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. 100 మీటర్ల దూరంలో ఉన్న బోరు నుంచి పైపులైను వేయాల్సి ఉంటుందని గ్రామ పంచాయతీలో నిధులు లేవని మండల అధికారులు చెప్పడంతో స్పెషల్ గ్రాంటు కింద రూ. 50 వేలు కేటాయిస్తామని డీపీవో చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్, మిషన్ భగీరథ ఏఈ అనిల్, మాజీ సర్పంచ్ లావుడ్య సరితరవీందర్ ఉన్నారు.

రోడ్డు వెడల్పు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

రాయికల్, ఏప్రిల్ 19: రాయికల్‌లోని మార్కెట్ వద్ద కుబేర బుక్ సెల్లర్ పక్క వీధి నుంచి వచ్చే రోడ్డును వెడల్పు చేయాలని కాలనీవాసులు శుక్ర వారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ వీధిలో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని, ఈ వీధి గుండా గుడేటిరెడ్డి, గంగపుత్ర, మ్యాదరి కుల సంఘ భవనాలు ఉండటంతో పోవడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. కాలనీవాసులు రాజేందర్, జలపతి, రవీందర్, గంగాధర్, రమేష్, రెడ్డి, ఉమేష్‌రెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

నామినేషన్ల ఘట్టానికి తరలిన కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు

గొల్లపల్లి, ఏప్రిల్ 19 : పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎంపీ అభ్యర్థులుగా వేరు వేరుగా శుక్రవారం నామినేషన్లు వేయగా నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు గొల్లపల్లి మండలం నుంచి ఆయా పార్టీలకు చెందిన శ్రేణులు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లగా, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపు మేరకు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు నామినేషన్ల ఘట్టానికి తరలివెళ్లారు. కాంగ్రెస్ నాయకులు గంగాధర్, సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, శ్రీధర్, వెంకటేష్, ఎంపీపీ శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు రమేష్ బాబు, హనుమాన్లు, కేషవ్ శ్యామ్, రవీందర్ పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



కథలాపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

కథలాపూర్, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలో శుక్రవారం కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు తొలగించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు ఎస్సై నవీన్ తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి గ్రామ శివారు దాకా విద్యార్థులతో కలిసి కవాతు చేపట్టారు. ప్ర జలు నిర్భయంగా తమకు కేటాయించిన బూతుల్లో ఓటు హక్కును విని యోగించుకోవాలని కోరారు.

ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజా స్వామ్యయు త వాతావరణంలో ఓటింగ్‌లో పాల్గొ నాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఎస్సైలు కిరణ్, అనిల్, కిరణ్‌కుమార్, సిబ్బంది పురుషోత్తం, నవీన్ ఉన్నారు.

నిప్పులకొలిమి



- మండుతున్న ఎండలు..
- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
- వెల్గటూర్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పగలు నిర్మానుష్యంగా ఉంటున్న రోడ్లు



వెల్గటూర్, ఏప్రిల్ 19: భానుడు భగ భగ మండుతుండడంతో జనం గజ గజ వణికి పోతున్నారు. ఎండలు దంచి కొడుతుండడంతో జనాలు బయటికి రావడానికి జంకుతున్నారు. వెలగటూర్‌లో మూడు నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రత 43 డిగ్రీలు దాటుతోంది. వెల్గటూర్‌లో గురువారం 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయింది. గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదులో వెల్గటూర్ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం విశేషం. దీంతో వాతావరణ శాఖ వెల్గటూర్‌కు రెడ్ అలర్ట్ ప్రకటించింది. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప బయటకు రావద్దని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. వెల్గటూర్‌లో శుక్రవారం 44.4 డిగ్రీలు నమోదు అయింది. బానుడి భగభగకు జనం వణికి పోతున్నారు. ఉక్కపోతతతో అల్లాడిపోతున్నారు. ఏసీలు, కూలర్లు కూడా పని చేయనంతగా వేడి ఉండడంతో ప్రజలు ఉడికిపోతున్నారు. ఇక ఫ్యాన్ వేసుకున్నా వేడి గాలి వస్తుండడంతో ఉపశమనం లభించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉదయం నుంచే ఎండ వేడి విపరీతంగా ఉంటోంది.

సూర్యుడు వస్తూనే తన ప్రతాపాన్ని చూపుతుండడంతో జనం బెదిరిపోతున్నారు. ఎండ తీవ్రతకు ప్రజలు బయటికి రావాలంటేనే జంకుతున్నారు. మిట్ట మధ్యాహ్నం రోడ్లు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. ఏప్రిల్ నెలలోనే రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుంటే ఇక మేలో ఎండలు ఎంత కొడుతాయో ఊహించుకుంటేనే భయం వేస్తోంది. రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఎండలు కొడుతాయంటారు కానీ అశ్విని కార్తెలోనే ఎండలు మండుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరబోసుకున్న రైతులు ఎండకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రానున్న రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. వడ గాలులు కూడా వీస్తుండడంతో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని పగటి పూట బయటకు రావద్దని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గర్భిణీలు, పిల్లలు, వృద్ధులు వడ దెబ్బ తగులకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు ద్రోణి ప్రభావం వలన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయనే చల్లటి కబురు అందడంతో ఉపశమనం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.

ఆకాశంలో మబ్బులు.. రైతుల గుండెల్లో గుబులు

- ఉరుములు, మెరుపులతో తుంపర్లు
- కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం రాశులు
- ఆందోళనలో రైతాంగం

గొల్లపల్లి, ఏప్రిల్ 19 : గొల్లపల్లి మండలంలో ఆకాశంలో మబ్బులు కమ్మి, ఆకాశంలో ఉరుములు, మెరుపులతో కూడిన తుంపర్లు పడడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని అక్కడక్కడా చినుకులు పడ్డాయి. ఇప్పటికే మండల వ్యాప్తంగా ప్రభుత్వరంగ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయి ఉన్నాయి. ఒక్కసారిగా వాతావరణం మారడంతో రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ముందస్తుగా ధాన్యం తడవకుండా ఉండేందుకు జాగ్రత్తలు పడుతున్నారు. గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు మొదలై ఊపందుకున్నాయి. దీంతో పాటు రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు నేరుగా తరలిస్తున్నారు. ఈపాటికే పలు గ్రామాల్లో ధాన్యం నిల్వలు కేంద్రాల్లో పేరుకుపోయి స్థలాలు సరిపోక రోడ్ల పైన పోసి ఎదురుచూస్తున్నారు. చాలాచోట్ల మ్యాచర్ రాక ఇప్పటికీ కొనుగోళ్లు జరగడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో గొల్లపల్లి, చెందోళి సింగిల్‌విండో ఆధ్వర్యంలో, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇటీవల ప్రారంభించారు. మ్యాచర్ పేరిట ధాన్యం తూకం వేయడంలో నిర్వాహకులు తీవ్ర జాప్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వారం పది రోజులకు పైగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోవటం, మరోవైపు ఎర్రటి ఎండల్లో రైతులు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయటం, ప్రస్తుతం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు, పలు కేంద్రాల్లో రైతులకు ధాన్యం రాశులపై కప్పేందుకు నిర్వాహకులు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాల్సి ఉండగా తీవ్ర కొరతతో రైతులే కవర్లు సొంతంగా తెచ్చుకుని రక్షించుకునే పనిలో పడ్డారు. మండలంలో ఈ యేడు మామిడి పంట కాత లేక తీవ్రంగా నష్టపోయిన రైతాంగం యాసంగి ధాన్యం పైనే ఆధారపడ్డారు. ఇప్పటికైన అన్ని కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు ఏర్పాటు చేసి, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతాంగం కోరుతుంది.



గొల్లపల్లి ఏఎంసీలో ధాన్యంపై రైతులు కప్పిన టార్పాలిన్ కవర్లు

కథలాపూర్ : మండలంలోని తాండ్రాల, అంబారిపేట, పోతారం, ఇప్పపల్లి, భూషణరావుపేట, చింతకుంట గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షం అన్నదాతను కలవరంకు గురిచేసింది. కొనుగోలు కేంద్రాల్లో రైతాంగం వరి ధాన్యం ఆరబెట్టగా అనూహ్యంగా వాన కురవడంతో పలు చోట్ల కొంతమేర ధాన్యం తడిచింది. అయితే అప్రమత్తమైన రైతులు వెంటనే టార్పాలిన్ షీట్లు కప్పుకుని ధాన్యం తడవకుండా కాపాడుకున్నారు. మోస్తరు వాన పడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడం పట్ల రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కోరుట్ల, ఏప్రిల్ 19: స్వేచ వాతవరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్‌లు కొరారు. శుక్రవారం మున్సిపల్ కమీషనర్ తిరుపతి ఆదేశాల మేరకు పట్టణంలోని రశ్మీదర్ బీ ఈడి కళశాలలో పార్లమెంట్ ఎన్నికల 2024ల సందర్బంగా స్వీప్ కార్యక్రమంలో భా గంగా ఐ ఓటు ఫర్ షూర్ అనే అంశంపై విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండి ఎలాంటి ప్రబావాలకు గురి కాకుండా ఓ టు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ల్ మహేష్, హేమంత్‌లతో పాటు విద్యార్థులు కళాశాల ఉపన్యాసకులు పాల్గొన్నారు.

'హోటల్ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు'

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్లు, హోటల్ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అనూష అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల పీఎంఆర్ గ్రాండ్ హోటల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లోని కిచెన్ రూమ్, స్టోర్ రూమ్‌లు తనిఖీ చేసి పురుగులతో నిండిన బియ్యం, నువ్వులు, పప్పులు తదితర సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. కాలం చెల్లిన ఫుడ్ రా మెటీరియల్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. స్టోర్ రూమ్, కిచైన్ రూమ్‌లను సీజ్ చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్వహిస్తున్న మామిడి మార్కెట్‌ను సందర్శించారు. పలువురు వ్యాపారులు మామిడి కాయలను ఎక్స్‌పోర్టు చేసే సందర్భంగా వినియోగిస్తున్న వివిధ కంపెనీల పౌడర్లను పరిశీలించారు. ఆమె మాట్లా డారు. వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈకార్యక్రమంలో పలువురు ఫుడ్ సేఫ్టీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో వసతులు కల్పించండి

కమీషనర్‌కు వ్యాపారులు, మహిళా రైతుల వినతి

కోరుట్ల, ఏప్రిల్ 19 : పట్టణంలోని గడి గురుజు ప్రాంత్రంలోని కూరగాయల మార్కెట్ వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం మార్కెట్‌లోని మహిళ రైతులు, వ్యాపారులు కలిసి వినతి పత్రాన్ని కమిషనర్ తిరుపతికి అందించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి మార్కెట్‌లో ఉన్న వసతులను వివరించారు. మరుగుదోడ్లు, తాగునీరు ఏర్పాటు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కమిషనర్‌తో వాపోయారు. తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటు చేసి ఆదుకోవాలని అన్నారు. తై బజార్ వేలం దక్కించుకున్న గుత్తెదారు ఇష్టా రాజ్యంగా రుసుము వసూలు చేస్తున్నట్లు కమిషనర్ దృష్టికి తీసుకపోయారు. వసతులు కల్పించకపోవడంతో పాటు గుత్తెదారు తైబజార్ వసులుపై ఒత్తిడి తేవడం ఏమిటని నిలదీసారు. వ్యాపారులను సముదాయించి మార్కెట్‌లో పూర్తి స్థాయిలో వసతులు కల్పన కోసం కృషి చేస్తామని కమిషనర్ వారికి తెలిపారు. తైబజార్ చెల్లించు రశీదును పొంది వ్యాపారులు సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్బంగా నేషనల్ హాకర్స్ పెడరేషన్ పట్టణ అధ్యక్షుడు షాహెద్ మహ్మద్ షేక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ జీవో ప్రకారం చిరు వ్యాపారుల నుంచి తైబజార్ రుసుం వసూల్ చేయడానికి వీలు లేదని తైబజార్ వసులన్న పట్టణంలో అపాలని డిమాండ్ చేశారు. తైబజార్ రుసుం వసూల్‌పై హైకోర్టును ఆశ్రయించ నున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు గంగు, హన్మక్క, భూమ్మక్కలతో పాటు వ్యాపారులు మహిళ రైతులు పాల్గొన్నారు.



కమిషనర్ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న వ్యాపారులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొడిమ్యాల, ఏప్రిల్ 19 : మండలంలోని తిర్మాలాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తి ర్మాలాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మేన్టనెన్స్ పనులు ఉన్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సంద్ర ల్లపల్లి, దమ్మయ్యపేట, కోనాపూర్, పోతారం, సూరంపేట, గంగారాంతండా, హిమ్మ తురావుపేట, శనివారంపేట రాం సాగర్, డబ్బుతిమ్మయ్యపల్లి ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవంగా బ్రహ్మంగారి కల్యాణం

కొడిమ్యాల, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో కొడిమ్యాల విశ్వబ్రాహ్మణ సంఘం(కర్రపని)వారి ఆధ్వర్యంలో శుక్రవారం గోవిందమాంబ బ్రహ్మంగారి కల్యాణం పండితులు వైభవంగా నిర్వహించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జగిత్యాలకు వచ్చిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయాన్ని శుక్రవారం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నరేంతర్ సందర్శించారు. జగిత్యాలకు వచ్చిన ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నరేంతర్‌కు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలోని పలు విభాగాల్లో జరుగుతున్న ఎన్నికల పనులను, కంట్రోల్ రూమ్ నిర్వహణను ఆయన పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులకు పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, పలు విభాగాలకు చెందిన అధికా రులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌ను సందర్శించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

ధాన్యం కొనుగోళ్లలో ఆటంకాలు లేకుండా చూడాలి



బొమ్మెనలో సిబ్బందికి సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్

కథలాపూర్, ఏప్రిల్ 19 : వరి ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) రాంబాబు సూచించారు. శుక్రవారం మండలంలోని దూలూరు, తక్కళ్లపల్లి, బొమ్మెన గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తాలు, తప్ప లేకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తూ వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. పుస్తక నిర్వాహణ, టోకెన్ల కేటాయింపు, ఆన్‌లైన్ నమోదు వంటివి పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులకు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీటీసీఎస్ శ్రీనివాస్, ఏపీఎం నరహరి, సీసీలు విజయలక్ష్మి, అశోక్, అంజయ్య, వీవోఏలు స్వప్న, శ్రీకాంత్ ఉన్నారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్, ఆలూరు, అల్యానాయక్ తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో సంపత్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అన్ని వసతులు కల్పించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. వీరి వెంట ఎంపీడీవో చిరంజీవి, ఏపీఎం శ్రీనివాస చక్రవర్తి, సీసీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తాటిపాముల వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్, రేకుర్తి లయన్స్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు రెండు వందల మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. ఇందులో సుమారు 96 మంది విద్యార్థులకు నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ణయించారు. రేకుర్తి లయన్స్ ఐ హాస్పిటల్‌లో విద్యార్థులకు ఉచితంగా నేత శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వడ్లగడ్డ శంకర్, కోశాధికారి గుండేటి గంగాధర్, మాజీ అధ్యక్షుడు తాటిపాముల సురేశ్ కుమార్, శ్రీరాముల సుదర్శన్, శివ శ్రీనివాస్, కాటిపల్లి గంగారెడ్డి పాల్గొన్నారు.

యాదవ సంఘ భవనం ప్రారంభం

కథలాపూర్, ఏప్రిల్ 19 : మండలంలోని పెగ్గెర్లలో శుక్రవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ యాదవ సంఘ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల సంఘాలు ఐక మత్యంతో ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని అన్నారు. భూషణరావుపేటలో రైతులు వరి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్య క్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, మండల బీసీ సెల్ విభాగం ఉపాధ్యక్షుడు ఎగ్యార పు శ్రీహరి, ఎన్ఆర్ఐ బైర దేవ్, సత్యనారాయణ ఉన్నారు.

హనుమాన్ స్వాములకు అన్నదానం

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 19 : జగిత్యాల మండలం లోని ధరూర్ పాటిమీద హన్‌మాన్ ఆలయంలో శుక్ర వారం హనమాన్ స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గ నాయకురాలు బోగ శ్రావణిప్రవీణ్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు న్యాయవాది మ్యాదరి అశోక్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అంతర్గాం విద్యార్థులు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 19 : జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు అల్లెపుపూజ, తునికికీర్తన, మడతరాహుల్, రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్య తెలిపారు. ఏప్రిల్ 25, 27న హైద్రాబాద్‌లో జరిగే జూనియర్స్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారు.

సంఘాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19: కుల సంఘాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో గంగపుత్ర సంఘ నూతన భవన నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యురాలు పియాంక - సురేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమి పూజల చేసి పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, లింబాద్రి, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా గీతాశ్రమ వార్షికోత్సవం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19 : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో శుక్రవారం భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి గీతాశ్రమ వారికోత్సవ వేడుకలను ఆశ్రమ నిర్వ హకులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన ఆశ్రమ నిర్వహకులు భజన కార్యక్రమాలను జరిపారు. గీతాపార యణంను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల టౌన్, మార్చి 19: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని 21 వార్డులో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ బీడీలు చుట్టే ప్రతి మహిళకు పింఛను ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, రాం చంద్రం, జితేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రారంభ దశలో చికిత్సతో కుష్టు నివారణ

మల్యాల, ఏప్రిల్ 19: కుష్టు వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించి వైద్యం అందించడంతో అంగవైకల్యం తదితర అనారోగ్య సమస్యలను నివారించవచ్చునని డిప్యూటీ డీఎం హెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి డా.మౌనిఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 120మందికి వైద్య పరీక్షలు చేయ గా ఒకరికి కుష్టు నిర్ధారణ జరిగింది. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీ, డీపీఎంవో దేవ్‌సింగ్, రమేష్, నాగలక్ష్మీ, రోహిదాస్, సునంద, రమణమ్మ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు

ఎమ్మెల్యే పరామర్శ

మెట్‌పల్లి, ఏప్రిల్, 19 : పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు డాక్టర్ రాఘవేంద్రరావు తండ్రి చిట్నేని కిషన్‌రావు మృతి చెందడంతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పరమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో కిషన్‌రావు చిత్రపటానికి నివాళులర్పించి సంతాపం తెలపారు. ఆయన వెంటా కౌన్సిలర్ మర్రి పోచయ్య, డాక్టర్ విద్యాసాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.